
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 జనవరి 2024
5
తూర్పుగోదావరి



నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎపిఇపిడిసిఎల్ ఇఇ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6:30 గంటల నుంచి 9:30 గంటల వరకూ శ్యామలా నగర్, మల్లిన నగర్, సోమాలమ్మ టెంపుల్ స్ట్రీట్, పోస్టల్ కాలనీ, అఫీషియల్ కాలనీ, చల్లా శంకర్ వీధి, ఓంకార్ స్ట్రీట్ పరిసర ప్రాంతాల్లో, రామాలయం ఏరియా, మల్లిన నగర్, కోకా భాస్కరమ్మ నగర్, బైబిల్ ప్లేస్ ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించవలసినదిగా కోరారు.

పండుగకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

- సాధారణ ఛార్జీలతో నిర్వహణ
- ప్రయివేటు ట్రావెల్స్ దోపిడీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పండుగ రద్దీ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతోంది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యాజమాన్యాలు ప్రజల ప్రయాణ అవసరాలను అవకాశంగా తీసుకొని యథేచ్ఛగా నిలువు దోపిడీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌టిసి ఊరట కల్పించేలా నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు, గోకవరం బస్టాండ్‌ల నుంచి సాధారణంగా ప్రతిరోజూ ఉండే 11 సర్వీసులతో పాటు పదో తేదీ నుంచి అదనంగా మరో 68 బస్సులను కేటాయించింది. ఈ బస్సులకు ఇప్పటికే వంద శాతం రిజర్వేషన్‌లు అయిపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయించక తప్పడం లేదు. ఉపాధి కోసం ఇతర పట్టణాల్లో స్థిరపడిన జిల్లా వాసులు సంక్రాంతి పండుగ నేపథ్యంలో తిరిగి తమ స్వస్థలాలకు రావడం పరిపాటి. కుటుంబ సభ్యుల రాకతో ప్రతి ఇంటిలోనూ పండుగ సంబరాలు దర్శనమిస్తుంటాయి. ప్రజల అవసరాలకు తగ్గట్లుగా ఆర్‌టిసి బస్సు సర్వీసులను పెంచక పోవడం, ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలపై పర్యవేక్షణ కొరవడడంతో ప్రయాణికుల జేబులకు చిల్లు పడుతోంది.

జిల్లాలోని 4 డిపోల నుంచి సర్వీసులు



జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ఆర్‌టిసి సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో హైదరాబాద్ నుంచి జిల్లాకు 68 అదనపు సర్వీసులు కల్పించాము. ఇతర ముఖ్య పట్టణాలను ప్రయాణికుల అవసరాలకు తగ్గట్లుగా పెరిగిన రద్దీ ఆధారంగా బస్సులను అందుబాటులో తీసుకొస్తున్నాము. సాధారణ ఛార్జీలే వసూలు చేస్తారు.

- కె.షర్మిల అశోక డిపిటిఒ, ఎపిఎస్ ఆర్‌టిసి తూర్పుగోదావరి జిల్లా.

అందుబాటులో ఆర్‌టిసి సర్వీసులు

ఎపిఎస్‌ఆర్‌టిసి పండుగ నేపథ్యంలో స్పెషల్ పేరుతో సర్వీసులను బుధవారం నుంచి ప్రారంభించనుంది. జిల్లాలోని 4 ఆర్‌టిసి డిపోలకు పది నుంచి 13వ తేదీ వరకూ వరకు హైదరాబాద్ నుంచి 68 సర్వీసులు అదనంగా కేటాయించింది. గోకవరం డిపో నుంచి 16 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, కొవ్వూరు డిపో నుంచి 7 సూపర్ లగ్జరీ, నిడదవోలు నుంచి 3 సూపర్ లగ్జరీ, రాజమహేంద్రవరం డిపో నుంచి 26 సూపర్ లగ్జరీ, 6 ఎక్స్‌ప్రెస్‌లు, 10 విఎల్‌డి సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికుల రద్దీ రీత్యా పరిమితులు కేటాయించే అవకాశాలున్నాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. తిరిగి 16వ తేదీ నుంచి జిల్లా నుంచి హైదరాబాద్ ఇతర ముఖ్య పట్టణాలకు సర్వీసులు అందుబాటులో ఉంచనున్నారు. గతంలో సాధారణ ఛార్జీలకు అదనంగా 50 శాతం వసూలు జరిగేది. గత కొన్నేళ్లుగా అదనపు ఛార్జీల వసూళ్లకు ఆర్‌టిసి యాజమాన్యం స్వస్తి పలికింది. సాధారణ ఛార్జీలే వసూలు చేస్తూ సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటుంది. పెరుగుతున్న రద్దీ రీత్యా మరిన్ని సర్వీసులు కేటాయించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



ప్రైవేట్ ట్రావెల్స్ నిలువుదోపిడీ

ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు యథేచ్ఛగా నిలువు దోపిడీ చేస్తున్నాయి. కాకినాడ నుంచి విజయవాడకు ఆర్‌టిసి ఛార్జి రూ.410 కాగా ప్రైవేటు బస్సులకు రూ.2000 చెల్లించాల్సి వస్తోంది. రాజమహేంద్రవరం నుంచి విశాఖ పట్టణానికి ఆర్‌టిసి ఛార్జీలు రూ.360 కాగా ప్రైవేట్ ట్రావెల్స్ రూ.2000 వసూలు చేస్తున్నాయి. కాకినాడ నుంచి హైదరాబాద్‌కు ప్రైవేటు బస్సులకు రూ.2010 చెల్లించాల్సి వస్తోంది. అమలాపురం నుంచి హైదరాబాద్ ప్రైవేట్ బస్సులకు రూ.3000 వసూలు చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి హైద్రాబాద్‌కు రూ.2100 చొప్పున టికెట్లు విక్రయిస్తున్నారు. ఒక్కొక్క టికెట్ ధరకు అదనంగా మూడు రెట్లు వసూలు చేస్తుండడంతో ఒక కుటుంబంపై రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు భారం పడుతుండడంతో సామాన్య ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు దేశంలో ప్రథమం

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్, కడియం

దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సిఎం జగన్ వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ఇంటి వద్దకే పెన్షన్ అందజేస్తున్నారని హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. ఆదివారం కొవ్వూరు మున్సిపల్ పరిధిలో సంస్కృత పాఠశాలలో నిర్వహించిన పెన్షన్ల పెంపు, నూతనంగా మంజూరైన వారికి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె 88 మంది లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అవ్వాతాతలతో పాటు వితంతువులు, వివిధ రకాల చేతివృత్తిదారులకు నెలనెలా ఇచ్చే పెన్షన్ మొత్తం జనవరి నెల నుంచి రూ.మూడు వేలకు ప్రభుత్వం పెంచిన సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ పెంపు, నూతన పెన్షన్ల మంజూరైన వారికి పెన్షన్ పంపిణీ ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. పెన్షన్ పంపిణీలో తీసుకొచ్చిన మార్పులను ఆమె వివరించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మ్యానిఫెస్టోలో 99.9 శాతం హామీలను అమలు చేశామని, ఇచ్చిన హామీలనే కాకుండా.. ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు.


కొవ్వూరులో పింఛన్లు అందిస్తున్న మంత్రి తానేటి వనిత

ప్రతి ఇంటా పెద్దకొడుకుగా సిఎం జగన్ కుటుంబాలను సంరక్షిస్తున్నారని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ అన్నారు. కడియం జెడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, నాయకులు దొంతంశెట్టి భద్రయ్య, తాడాల చక్రవర్తి, ఎంపిడిఒరత్నకుమారి పాల్గొన్నారు.

మెడికల్ రిప్స్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మెడికల్ రిప్స్ సమస్యలు పరిష్కరించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రంజంటేటివ్స్ యూనియన్ వార్షిక సర్వ సభ్య సమావేశం సోమవారం ఎన్‌జిఒ హాల్లో నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.కుమార్ మాట్లాడుతూ దేశంలో మెడికల్, సేల్స్ రంగంలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదని, ఎస్‌పిఇ యాక్ట్‌ను అమలు చేయడం లేదని, వీటి అమలు కోసం పోరాటం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి నెలలో జరిగే ఎఫ్‌ఎంఆర్‌ఐ జనరల్ కౌన్సిల్ ఆలిండియా సమావేశాలు, ఎపిఎంఎస్‌ఆర్‌యు జనరల్ కాన్ఫరెన్స్‌ను జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.సత్తిరాజు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక రంగంగా ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపినిచ్చారు. దేశంలో ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెసెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 60 ఏళ్ల నుంచి అనేక పోరాటాలు చేసి సాధించుకొన్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌గా మార్చివేసిందని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు జిలాని, ఎఐఐయు నాయకులు పిఎస్‌ఎన్.రాజు మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఎంవివి.సత్యనారాయణ, రణదీప్ సింగ్ జెవి.గోపాలకృష్ణ కోశాధికారిగా, ఖాదర్, సత్తిబాబు, రాంబాబు, రామగణేష్ సహాయ అధ్యక్ష కార్యదర్శులుగా, 16 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రామారావు, మూర్తి, దానేశ్వరరావు, లవకుమార్, సురేష్, శాస్త్రి, అలీ, చందు, బాలకష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు

విజెఎస్‌లో జాతీయ ఫార్మసీ సదస్సు

ప్రజాశక్తి - రాజానగరం

స్థానిక దివాన్ చెరువు విజెఎస్ ఫార్మసీ కళాశాలలో శనివారం, ఆదివారం ఔషధ పరిశోధనలో పరిణామాలు, సవాళ్లు, పరిధి అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మోటు ఎం.పటేల్, ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ దీపంద్ర పేంద్ర సింగ్, ఎగ్జిక్యూటివ్ క్లినికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎం.వెంకటరమణ, డాక్టర్ ఎల్‌ఎల్‌ఎన్.ప్రసాద్ రెడ్డి. డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్‌వివి.జగన్మోహన్ రెడ్డి, ఛైర్‌పర్సన్ ఎన్.శకుంతల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.నరేంద్ర, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవిశంకర్ పాల్గొన్నారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ పటేల్ మాట్లాడుతూబ జాతీయ విద్యా విధానంలో మార్పులు, దానికి అనుగుణంగా విద్యా విధానంలో నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీ, కొత్త అభివృద్ధులు, అధ్యాపకులు, విద్యార్థులు అవలంబించాల్సిన మార్గాలను వివరించారు. అనంతరం ఫార్మసీ రంగంలో ఉన్న ప్రముఖులకు అవార్డులను బహూకరించారు.

నేటి నుంచి రైతు సంఘం రాష్ట్రమహాసభలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు రాజమహేంద్రవరంలో సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన పాత్రికేయలతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఈ మహాసభలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. యువత వ్యవసాయం చేయలేని పరిస్థితులు పాలక ప్రభుత్వాలు తెచ్చాయన్నారు. ప్రతి కుటుంబం మీదా రూ.2.45 లక్షల అప్పు ఉందన్నారు. రైతాంగ ఆత్మహత్యలు ఆపుతానని, ఆదాయం రెట్టింపు చేస్తానన్న మోదీ ప్రభుత్వంలో మరో లక్షకు పైగా మంది ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో సిఎం వైఎస్.జగన్ ఇచ్చిన హామీలన అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి రైతు కమిటీలు ఏర్పడి రాజమండ్రి చేరుకుంటున్నాయన్నారు. ఈ మహాసభలలో వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసే విధంగా తీర్మానాలు చేసి, భవిష్యత్ కార్యచరణపై చర్చిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ్రపు రాంబాబు, కోశాధికారి వి.కొండలరావు, ఎపి రైతు సంఘం కార్యదర్శి మల్నీడి యల్లమందరావు తదితరులు పాల్గొన్నారు

రజకుల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రజకుల అభివద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, టిడిపి ప్రభుత్వ హయాంలో ఆదరణ పథకం ద్వారా వారిని ఆదుకున్న వైనమే అందుకు నిదర్శనం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఇటీవల జరిగిన రజక సేనాసంఘం ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ రజక సాధికార కమిటీ కన్వీనర్ బొమ్మదేవర శ్రీనివాస్ ఆయన ప్యానల్ సభ్యులకు వాసు అభినందనలు తెలిపారు. తిలక్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో వారిని సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రజక సోదరులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని, అందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో సాధించినవారు మిగిలిన వారిని కూడా కలుపుకుని సభ్యుల సంక్షేమానికి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లెల శ్రీనివాస్, అధిక సంఖ్యలో రజక సోదరులు పాల్గొన్నారు.


రజక సంఘం ప్రతినిధులతో వాసు

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-గోపాలపురం

క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆర్ అండ్ ఎమ్ ఫౌండేషన్ చైర్మన్ గంట మధు కృష్ణ అన్నారు. ఆర్‌అండ్ ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వేళ్ల చింతలగూడెంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం రెండో రౌండ్‌కు చేరుకున్నాయి. పోటీల్లో మొదటి మ్యాచ్‌లో కోరుకొండ జట్టుపై పెందుర్తి జట్టు విజయం సాధించింది. అనంతరం గుడ్డిగూడెం జట్టుపై పెన్వర్ జట్టు (నెల్లూరు) 46 పరుగులు తేడాతో విజయం సాధించింది. పెన్వర్ జట్టులో 33 పరుగులు చేసిన సుధీర్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

ఫైలేరియాను పారదోలుదాం

ప్రజాశక్తి-నల్లజర్ల

బోదకాలు వ్యాధిని గుర్తించేందుకు జ్వర సర్వే తరహాలోనే ఫైలేరియా సర్వేను వైద్య ఉద్యోగులు నిర్వహిస్తున్నారు. నల్లజర్ల మండలం దూబచర్లలో రాత్రి ఏడున్నర నుంచి పదిన్నర గంటల వరకూ వైద్య ఉద్యోగులు బృందాలుగా ఏర్పడి మైక్రో ఫైలేరియా నిర్ధారణ సర్వేను నిర్వహించారు. ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాదరావు నేతృత్వంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి రాత్రి వేళ రక్త నమూనాలు సేకరించారు. ఈ నెల 2న ప్రారంభమైన ఈ కార్యక్రమం పదో తేదీతో ముగుస్తుందని, ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఆ రోజు రాత్రి 300 రక్త నమూనాలు సేకరిస్తారని డాక్టర్ గంగాధరరావు తెలిపారు.

హాస్పిటల్‌కు వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డు అందజేత

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

ఆరోగ్యశ్రీ కార్డు చికిత్స పరిధిని రూ.25 లక్షల వరకూ పెంచిన నేపథ్యంలో రాజమహేంద్రవరం జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగికి వాలంటీర్ బి.దుర్గ స్వయంగా వెళ్లి అందించారు. వాలంటీర్ దుర్గ పోలియో వ్యాధిగ్రస్తురాలైనా పలువురు వాలంటీర్లకు స్ఫూర్తినిచ్చే విధంగా తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించారని సచివాలయం సెక్రటరీ డి.సూరిబాబు అభినందించారు.

ఎస్మా చట్టం ప్రతుల దహనం

అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టం ప్రతులను జిల్లాలోని పలుచోట్ల ఆదివారం దహనం చేశారు. అనంతరం దీక్షలను ప్రారంభించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం కోటగుమ్మం వద్ద అంగన్‌వాడీలు ప్రతులను దహనం చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీమణి, కౌన్సిలర్లు అనిత, రాజేశ్వరి, పార్వతి, ఐద్వా జిల్లా నాయకులు టి.సావిత్రి పూలమాలలు వేసి దీక్ష ప్రారంభించారు. మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ ఎస్మా చట్టానికి సంబంధం లేని వారిపై ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి టిడిపి అండగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అరిగెల అరుణ్ కుమారి, నాయకులు బాలేపల్లి మురళీధర్, టివి.కుమార్ మద్దతు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన జువ్వల రాంబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్.మూర్తి, కెవిఎస్‌వి.రామచంద్రరావు, కె.అన్నామణి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, సుబ్బలక్ష్మి, మాలతి, సునీత, శారదా, రామలక్ష్మి, విజయకుమారి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం తహశీల్దారు కార్యాలయం వద్ద సమ్మె శిబిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు ఆధ్వర్యంలో ఎస్మా జిఒ ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.రంగనాయకమ్మ, ఎం.జానకి, పివిఎస్ఎస్.లక్ష్మి, విజయ కుమారి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

చాగల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద గౌరవ వేతనం మాకొద్దు కనీస వేతనం కావాలని నినాదాలు చేశారు. పి.విజయ కుమారి, కె.లక్ష్మి మాట్లాడారు. కె.దమయంతి, ఎ.శ్రీదేవి, బి.మహాలక్ష్మి, ఎస్.అరుణ్ కుమారి పాల్గొన్నారు

దేవరపల్లి సిఐటియు మండల కార్యదర్శి భగత్ మాట్లాడారు. పొర్లు దండాలు పెడుతూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు కె.రత్నాజీ, అంగన్వాడీ నాయకులు టిపి.లక్ష్మి, ఎ.పద్మకామేశ్వరి, కె.గంగాభవాని, ఉండవిల్లి మంగతాయారు, కె.దేవి, సావిత్రి, కె.వరలక్ష్మి, అనసూయ, మహాలక్ష్మి, టి.కృష్ణకుమారి పాల్గొన్నారు


గోపాలపురం చెక్ పోస్ట్ సెంటర్‌లో రామలక్ష్మి ఆధ్వర్యాన ఎస్మా ప్రతులను దహనం చేశారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు.


రాజమహేంద్రవరంలో ప్రతుల దహనం


గోపాలపురంలో..


దేవరపల్లిలో అంగన్‌వాడీల పొర్లుదండాలు

కార్టూ'నిజం'



సందడిగా ముగిసిన తెలుగు మహాసభలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గైట్ కళాశాల వేదికగా ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు మహాసభలు ఆదివారం ఘనంగా ముగిశాయి. శ్రీరాజరాజ నరేంద్ర, నన్నయ, నారాయణ భట్టు పేరిట మూడు వేదికలు ఏర్పాటు చేసి నిర్వహించిన ప్రసంగాలు, సాంస్కతిక కార్యక్రమాలు, కవితా పఠనం, వివిధ సాహితీ ప్రక్రియలపై సదస్సులు ఆకట్టుకున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి తెలుగువారు ఈ సభలకు హాజరయ్యారు. చివరిరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాంస్కతిక కార్యక్రమాలతో శ్రీ రాజరాజ నరేంద్ర వేదిక అలరించింది. వివిధ స్కూల్స్ విద్యార్థులు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. మధ్యాహ్నం ప్రారంభమైన ముగింపు సభలో నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వేంకట శేషసాయి, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంథి భవానీ ప్రసాద్, విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ స్వాగతం పలికారు. చైతన్య విద్యాసంస్థల అధినేత డా చైతన్య రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ఎపి ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు అలీ, మంత్రి మేరుగ నాగార్జున, రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, సినీ నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, కలికివాయి సుజాతరావు, సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, నన్నయ యూనివర్సిటీ విసి ఆచార్య కె.పద్మరాజు, తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటుడు అలీ, వేదాంతం రాధేశ్యామ్‌శర్మ, ఉప్పలపాటి శ్యామలాదేవి, ఎన్‌ఆర్‌ఐ ప్రేమ్ స్వరూప్‌కు నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ పురస్కారాలు అందజేశారు. విజయడైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, విహెచ్‌పి నాయకులి తటవర్తి కృష్ణమూర్తి, శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదన గోపాలస్వామి, డాక్టర్ అనసూరి పద్మలత, డాక్టర్ శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. డాక్టర్ చైతన్య రాజును గజమాలతో, భారీ ప్రశంసా పత్రంతో సన్మానించారు. రవివర్మ, శశి వర్మ, మంతెన కేశవరాజు, సత్యనారాయణ రాజు మాస్టారు, కె.రామ్‌ప్రసాద్,మహాసభల సమన్వయ కర్త సునంద రమేష్, శతావధాని కడిమెళ్ళ వరప్రసాద్, ధవేజీ, కోట్ల కనకేశ్వరరావు, అపుస్మ అధ్యక్షుడు సుంకవల్లి మురళి, సుమేధ రాజు, ఆకుల ప్రకాష్, బర్ల సత్యనారాయణ, తీగల రాజా, నటుడు గౌతమ్ రాజు, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.



మెమెంటో అందుకుంటున్న ఎంఎల్‌సి ఐవి

జెవివి ఆధ్వర్యాన చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జెవివి ఆధ్వర్యాన సోమవారం చెకుముకి సైన్స్ సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీ గౌతమి ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీరామ్ నగర్ బ్రాంచ్ వద్ద కన్వీనర్ ఎన్.రవిబాబు ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎం.మల్లికార్జునరావు మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు చెకుముకి సైన్స్ సంబరాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. ప్రధాన కార్యదర్శి వై.పైడియ్య మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా స్థాయి చెకుముకి సంబరాల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు గౌరవాధ్యక్షులు డాక్టర్ చైతన్య శేఖర్ బహుమతులను అందించారు. ప్రైవేటు పాఠశాల విభాగంలో ప్రథమ బహుమతిని శ్రీ షిరిడీసాయి విద్యానికేతన్ రాజమహేంద్రవరం, ద్వితీయ బహుమతిని శ్రీషిరిడీ సాయి విద్యానికేతన్, కడియం, తృతీయ బహుమతి శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, దివాన్ చెరువు, కన్సోలేషన్ బహుమతి శ్రీ సద్గురు విద్యాలయం, కాతేరు విద్యార్థులు గెలుచుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతిని జెడ్‌పి ఉన్నత పాఠశాల, కాతేరు, ద్వితీయ బహుమతిని ఎస్‌పిపిపిఆర్ జెడ్‌పి ఉన్నత పాఠశాల, పందలపాక, తృతీయ బహుమతిని ఎవిఆర్ జెడ్‌పి ఉన్నత పాఠశాల, కడియం, కన్సోలేషన్ బహుమతిని ఎంవిఎస్ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఉండ్రాజవరం విద్యార్థులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో వసంతరావు, సిహెచ్.నిశ్చల్, దేవి తదితరులు పాల్గొన్నారు.


చెకుముకి పోటీల్లో విజేతలు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామం శివారు పేకాట శిబిరంపై ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.32, 780 స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోడి పందేలపై దాడి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని అంకంపాలెం గ్రామం శివారు ఏటిగట్టు వద్ద కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారంతో ఆదివారం ఎస్ఐ బివై .కిరణ్ కుమార్ తన సిబ్బందితో దాడి నిర్వహించారు. ఈ దాడిలో కోడిపందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 400, ఒక కోడిపుంజును, 4 కోడి కత్తులు స్వాధీన చేసుకుని కేసు నమోదు చేసినట్లు అని తెలిపారు.

చలికాలం జాగ్రత్తలు తీసుకోవాలి

డిఎం హెచ్ఒ నరసింహ నాయక్



ముఖాముఖి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాపై చలి పులి పంజా విసురుతోంది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా ప్రజలు బయటకు రావడానికి ధైర్యం చేయలేకపోతున్నారు. పొగమంచు పూర్తిగా కమ్ముతుంది. దానికి తోడు చల్లని గాలులు వీస్తుండడంతో ఎముకలు కొరికే చలి ప్రజల్ని వణికిస్తోంది. దీంతో బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ తెలిపారు. ప్రస్తుతం అనారోగ్య సమస్యలు ఎక్కువగా బయట పడుతున్న నేపథ్యంలో ఆయన పలు అంశాలను వివరించారు.

ఎలాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది

ప్రస్తుతం కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ చలిలో వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. చలి వలన ఊపిరితిత్తులు కొంత ఆయాసానికి గురవుతాయి. చర్మం పగుళ్లు బారడం ఆరంభమవుతుంది. మిగతావారితో పోలిస్తే చలికాలం పసికందులు, వృద్ధులకే సమస్యలెక్కువ. ఈ కాలం వీళ్లల్లో రెసిస్టెన్స్ లోపించి ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గుతుంది. దగ్గుతో కఫాన్ని బయటికి తెప్పించే శక్తి లేకపోవటం వల్ల ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఎక్కువవుతుంది.

వృద్ధులు, పసి పిల్లలపై ప్రభావం ఎక్కువగా ఉంటుందా

వృద్ధుల్లో ప్రత్యేకించి ఆర్థరైటిస్ ఉంటే ఎముకలు మరింత బిగుసుకుపోయే ప్రమాదం ఉంది. కదలికలు తగ్గి కొన్నిసార్లు పట్టుతప్పి పడిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. పసికందులను చలిగాలి సోకకుండా వెచ్చగా ఉంచాలి. స్వెటర్లు, మెత్తని రగ్గులు వాడాలి.

గుండె సంబంధిత వ్యాధులపై ఎలా అప్రమత్తంగా ఉండాలి

చలికాలంలోనే గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగానే ఉంటాయి. ఉష్ణోగ్రత పడిపోయినప్పుడు రక్తనాళాలు మూసుకుపోయి, రక్తాన్ని శరీర భాగాలకు పంపిణీ చేయడం గుండెకు కష్టమవుతుంది. ఈ స్థితిలో గుండె రక్తాన్ని పంపిణీ చేయడానికి ఎక్కువగా శ్రమిస్తుంది. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. ప్రత్యేకించి వృద్ధుల్లో సిస్టాలిక్, డయాస్టాలిక్ రక్తపోట్లు రెండూ పెరుగుతాయి. ఆస్తమా వ్యాధిగ్రస్తులై ఉంటే వారిలో చల్లగాలి వల్ల శ్వాసనాళాలు కుంచించుకుపోతాయి. అందువల్ల చలి గాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడమే పరిష్కారం.

కరోనాపై మీరిచ్చే సలహాలు ఏమిటి

కరోనాపై అపోహలను వీడనాడి, అవగాహనతో మసులుకోవాలి. కరోనాపై ఎవరూ ఆందోళన చెందనవసరం లేదు. జాగ్రత్తలు తీసుకుంటే దూరం పెట్టవచ్చు.

జెఎఎస్ కార్యక్రమం ఎలా అమలవుతుంది

జిల్లాలో జరుగుతున్న రెండవ దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సక్రమంగా నిర్వహించడంతోపాటు వైద్య శిబిరాల్లో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫరల్ చేసిన కేసులపై వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేసే విధంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నాం. వైద్య శిబిరాల్లో ప్రత్యేక కేసుల కింద నమోదైన వాటిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు పంపించి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముద్రించిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఎస్మా ప్రయోగం హేయమైన చర్య

ప్రజాశక్తి - కాకినాడ

అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడం హేయమైన చర్య అని జిల్లా హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిఎ.రత్నరాజు అన్నారు. వారి కుటుంబాలను వదిలి తమ హక్కుల కోసం ఉద్యమాన్ని నిర్వహిస్తున్న వారిని అణిచి వేసేందుకు ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం అప్రజాస్వామికమని అన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న విపరీతమైన ధోరణిని ఉద్యోగులందరూ గుర్తించాలన్నారు. ఒకప్పుడు గుర్రాలతో తొక్కించారని చెప్పిన నేటి పాలకులు మొత్తంగా ఉద్యమాన్నే అణిచివేసేందుకు నియంతలా మారడం దుర్మార్గమని అన్నారు. న్యాయపరమైన డిమాండ్స్‌ను ప్రభుత్వమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇదే పంథాలో ముందుకు సాగితే ఉద్యమ రూపం మారి ప్రభుత్వ మనుగడకే ప్రమాదమని గ్రహించుకుంటే మంచిదని సలహా ఇచ్చారు.



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న జ్యోతుల నవీన్

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని వెంగయమ్మపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వైసిపి నాయకులు అప్పాన అమ్మాజీ, దాసరి చిన్న, వల్లేపు భాస్కర రావు, శ్రీనులకు ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అమ్మాజీ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అని మా ఓట్ల ద్వారా గద్దెనెక్కిన సిఎం జగన్ రెడ్డి ప్రజల అభివృద్ధిని గాలికి వదిలేశారని విమర్శంచారు. ఒక ఇల్లు కట్టుకోవాలన్న భయపడే పరిస్థితులను తీసుకొచ్చారని వాపోయారు. ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని, రాబోయే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, పాండ్రంగి రాంబాబు, వల్లేపు అన్నవరం, గెడ్డం అన్నవరం, శరకాని సుబ్బారావు, దశరథ బాపూజీ, రాయి సాయి వెలిశెట్టి బుజ్జి, నలమాటి ఆనంద్, కుప్పా తాతారావు తదితరులు పాల్గొన్నారు. .



టిడిపిలో చేరిన వారితో జ్యోతుల నెహ్రూ

మల్లేపల్లిలో వైసిపికి ఎదురుదెబ్బ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి అన్నపురాజిపేటలో వైసిపికి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. లంక శ్రీను, కొల్లు త్రిమూర్తులు, కళారి బాబురావు ఆధ్వర్యంలో వైసిపికి చెందిన కలీం శ్రీను, బలిరెడ్డి వెంకన్న, చిక్కాల తాతారావు, పాండ్రంగి శ్రీను, మండే శ్రీను, కవలపల్లి బ్రహ్మం, కలిమి శివ, కలిమి నాగేశ్వరరావు, గొల్లపల్లి చక్ర రావు, చిక్కాల అప్పారావు, గొర్ల నాగేష్ తదితర 50 కుటుంబాల వారు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి నెహ్రూ పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ అన్నపురాజుపేటలో పార్టీలో చేరుతున్న వారందరూ పాత కొత్త కలయికతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, యర్రంశెట్టి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

చోరీ ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ద్వారపూడి గ్రామంలో వెంకటరమణ జ్యువెలర్స్ నందు శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బంగారం, వెండి నగలు అపహరించుకుపోయారు. దీనిపై దుకాణయజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం దొంగతనం జరిగిన ప్రదేశాన్ని రామచంద్రపురం డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ పరిశీలించారు. ఆయన వెంట సీఐ శ్రీధర్ కుమార్, ఎస్ఐ బళ్ళా శివకష్ణ తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విలసవిల్లి బాలయోగి వారధి దగ్గర ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ సలాది ఊర్మిళదేవి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ తదితరులు పాల్గొన్నారు

జాంధానీ చీరకు జాతీయ గుర్తింపు

-మగువలు మెచ్చే చీర ఉప్పాడ జాంధాని



అవార్డును కలెక్టర్ కృతికా శుక్లాకు అందిస్తున్న పెద్దిరాజు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ అంటేనే... చేనేత చీరలకు ప్రసిద్ధి.. ఇలాంటి ఉప్పాడ చీరలకు జాతీయ అవార్డు లభించింది. ఉప్పాడ జాంధాని చీరలు... దేశంలో బంగారు కీర్తి పథకాన్ని సాధించింది. భారత ప్రభుత్వం 2023 సంవత్సరానికి ప్రకటించిన ప్రతిష్టాత్మకమైన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ జాతీయ అవార్డు లలో వ్యవసాయేతర విభాగం క్రింద ఉప్పాడ జాంధాని చీరలు ఉత్పత్తులకు కాకినాడ జిల్లాకు గోల్డ్ అవార్డు లభించింది. ఈ నెల 3వ తేదీన, న్యూఢిల్లీలోని భారత మండపంలో కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వశాఖ, పరిశ్రమలు, అంతర్జాతీయ వాణిజ్య ప్రోత్సాహక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మ నిర్భర్ భారత్ ఉత్సవ్-2024 వేడుకలలో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డా.సుబ్ర మణ్యం జయశంకర్, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా కాకినాడ జిల్లాకు ఈ అవార్డును ప్రదానం చేశారు. కాకినాడ జిల్లా కలెక్టర్ తరపున జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి కూరెళ్ళ పెద్దిరాజు ఈ అవార్డును అందుకున్నారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ అవార్డులకు జాతీయ స్థాయిలో మొత్తం 560 దరఖాస్తులు నమోదు కాగా, 64 దరఖాస్తులు మాత్రమే నామినేట్ అయ్యాయి. వీటిలో వివిధ రాష్ట్రాలకు చెందిన 16 ప్రొడక్ట్ లకు జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నాయి. వ్యవసాయేతర విభాగంలో ఉప్పాడ జాంధాని చీరలు ఉత్పత్తులకు కాకినాడ జిల్లా 2023 సంవత్సరానికి వన్ డిస్ట్రిక్ట్ -వన్ ప్రొడక్ట్ అవార్డును గెలుచుకుంది.

జాతీయ అవార్డు రావడం పై హర్షం

ఉప్పాడ జాంధాన్ని చేనేత చీరలకు జాతీయ అవార్డు రావడంపై ఉప్పాడ చేనేత కార్మికులు, వ్యాపారులు వర్షం వ్యక్తం చేశారు. ఉప్పాడ జాంధాన్ని చీరలు ధరించేందుకు ప్రతి మహిళా చూపుతుందన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉప్పాడ చేనేత వ్యాపారులు లోల్ల సత్తి పండు, చొడిశెట్టి సురేష్, సతీష్, గంగ ,హరిబాబు, త్రిమూర్తులు, సిలామంతుల రాంబాబు, మల్లిబాబు, మధు, మహేష్ తదితరులు ఉన్నారు.

ఉప్పాడ జాంధానీ చీరల వైభవం ఇది

ఉప్పాడ జాంధాని చీరలకు అవార్డు రావడంపై ఇక్కడ కార్మికులు కష్టం ఎంతగానో ఉంటుంది. నేత కార్మికులు ఒక జాంధాని చీరను తయారు చేసేందుకు పది నుంచి 30 రోజులు ఎంతో శ్రమిస్తారు. ముగ్గురు చేనేత కార్మికులు 15 రోజులు కష్టపడితే.. ఒక అందమైన జందని చేనేత చీర బయటకు వస్తుంది. ఈ జాంధానీ చీరలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. జాంధాని చీరలు అంటే రెండు వైపులా ఒకే డిజైన్తో... ఎంతో తేలికగా ఉండే విధంగా ఉప్పాడ చీరలు తయారు చేయడం ఉప్పాడ చేనేత కార్మికుల ప్రత్యేకత.

ఒడిగోస్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడ



వినోద్‌ను షీల్డ్‌ను బహుకరిస్తున్న జూపూడి, తదితరులు

ఒడిగోస్ సేవలు అభినందనీయమని ఎపి ప్రభుత్వ న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ అన్నారు. స్థానిక ఒడిగోస్ కార్యాలయంలో ఆదివారం అభినందన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఒడిగోస్ సిఇఒ వార వినోద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. సిలికాన్ ఇండియా ఇంటర్నేషనల్ మ్యాగజిన్ గుర్తించిన టాప్ 10 ప్రామిసింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఒకటిగా ఒడిగోస్ నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు సాఫ్ట్వేర్ కోర్సెస్ లో శిక్షణ ఇవ్వడానికి ఒడిగోస్ విశేష కృషి చేస్తున్నదని కొనియాడారు. సివైఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు మాట్లాడుతూ అనేకమంది విద్యార్థులకు ఉద్యోగ సాధనలో ఒడిగోస్ సంస్థ కీలకపాత్ర పోషిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల హెచ్ఒడి డాక్టర్ పివివి. సత్యనారాయణ, రాష్ర నాయకులు గగారిన్, కామేష్, భీమారావు, జానకిరామ్‌చౌదరి, విక్లిఫ్ తదితరులు పాల్గొని వార వినోద్‌కు సిలికాన్ ఇండియా షీల్డ్‌ను బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా ఒడిగోస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

జగ్గంపేటలో జనసేన పార్టీని గుర్తించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

జగ్గంపేట నియోజకవర్గంలో జనసేన పార్టీని గుర్తించాలని పార్టీ జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. స్థానికంగా ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. జగ్గంపేటలో జనసేన పార్టీ ఇదివరకుతో పోలిస్తే బాగా బలపడిందని, పార్టీ ఆవిర్భావం నుంచి అంచెలంచెలుగా ఎదిగి విజయం దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. జగ్గం పేట నియోజకవర్గంలో పొత్తులో భాగంగా జనసేనకు సీటు ఇస్తే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, పార్టీ అభివృద్ధికి కష్టపడిన జనసేన కార్యకర్తలు గాజు గ్లాస్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడానికి కుతుహాలంగా ఉన్నారన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మొద్దు అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ తీసుకునే ఏ నిర్ణయాన్ని అయిన శిరసా వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కిర్లంపూడి మండల అధ్యక్షులు ఉలిసి అయిరాజ్, జగ్గంపేట మండల అధికార ప్రతినిధి పాలిశెట్టి సతీష్, ఉన్నారు.

వైసిపి ప్రభుత్వం ద్వారానే సంక్షేమం

ప్రజాశక్తి - పెద్దాపురం



పింఛన్లను పంపిణీ చేస్తున్న దొరబాబు

రాష్ట్రంలో ప్రజా సంక్షేమం సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక గౌరీ కోనేరు సెంటర్‌లోని ముప్పన రామారావు కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన 14 వ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. 529 మందికి పింఛన్లు, 760 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యమ్రంలో వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు కట్టా రాజబాబు, నీలంశెట్టి అమ్మాజీ, సత్యభాస్కరరావు, గోకేడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పునర్జన్మ ఇచ్చింది జగన్



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ఇన్‌చార్జ్ తోట నరసింహం

ప్రజాశక్తి - గండేపల్లి

తనకు రాజకీయ పునర్జన్మ ఇచ్చింది వైఎస్ జగన్ అని జగ్గంపేట నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తోట నరసింహం అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో వైసిపి మండల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మరోసారి రాజకీయ పునర్జన్మ ఇచ్చిన జగన్‌కు రుణపడి ఉంటానని అన్నారు. మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే తన ముందున్న లక్ష్యమన్నారు. జగ్గంపేట నియోజకవర్గ ప్రజలకు పదేళ్లపాటు దూరంగా ఉన్నప్పటికీ తనపై ఎంతో అభిమానం ఉంచి ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.కొంతమంది నాయకులు విమర్శలు చేస్తున్నారని వాటికి నేను జవాబు ఇచ్చే పని లేదన్నారు. తాను ఏనాడు ఏ నాయకుడిని విమర్శించలేదని, ప్రజలు సమస్యలు పరిష్కరిస్తూ వారికి సేవ మాత్రమే చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట రాంజీ, ఎంపిపి చలగళ్ళ దొరబాబు, మద్దిపట్ల రామకృష్ణ, ఒమ్మి రఘురాం, ఒబిన్ని సత్యనారాయణ, గుల్లా ఏడుకొండలు, రామకుర్తి మూర్తి, తొండపు రమణారెడ్డి తాళ్లూరు మధు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సొంత గృహాలు



సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలని లక్ష్యంతో సిఎం జగన్మోహన్ రెడ్డి నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమం చేపట్టారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని అచ్చంపేట శివారు బ్రహ్మానందపురం జగనన్న లేఅవుట్‌లో పనసపాడు గ్రామానికి చెందిన సుమారు 200 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల అప్పగింత కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దొరబాబు మాట్లాడారు. రెండో పేజ్‌లో జగనన్న కాలనీలో లబ్ధిదారులందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. లబ్ధిదారులు ఇళ్ల స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వైస్ ఎంపిపి మలసా శ్రీను, ఉండూరు గ్రామ సర్పంచ్ సత్యడి ధనలక్ష్మి, ఉపసర్పంచ్ కొప్పిరెడ్డి రాధాకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు కొండలరావు, డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్, ఉండూరు గ్రామ కార్యదర్శి తోట సత్యనారాయణ, విఆర్ఒలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

జోరుగా.. హుషారుగా..

ఘనంగా యానాం ప్రజా ఉత్సవాలు



ప్రజాఉత్సవాలకు హాజరైన ప్రజలు

ప్రజాశక్తి - యానాం

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 20వ యానాం ప్రజా ఉత్సవాలు ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభం అయ్యాయి. వివిధ సాంస్కతిక కార్యక్రమాలు, సాహస విన్యాసాల ప్రదర్శనలతో యానాం ప్రజా ఉత్సవాలు ప్రజలను, ముఖ్యంగా యువతి యువకులను హుషారెత్తిస్తున్నాయి. ఉత్సవాల రెండో రోజైన ఆదివారం నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు యువతీ, యువకులను కేరింతలు కొట్టించాయి. యానాం పరిసర ప్రాంతాల నుంచే కాకుండా ప్రక్క జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో ప్రజా ఉత్సవాలు జరుగుతున్న జిఎంసి బాలయోగి స్టేడియం జనంతో నిండిపోయింది. పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పర్యవేక్షణలో వేదిక వద్ద వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కలకత్తా నుంచి వచ్చిన డ్యాన్స్ టీమ్ ప్రదర్శించిన నత్యాలు అందరినీ అలరించాయి. అలాగే భారతీయ సాంప్రదాయ పద్ధతిలో ఫ్యాషన్ షో, జట్టి మూవీ బృందంచే సినీ డాన్స్ ప్రోగ్రాం, కలకత్తా మణిపూరి క్లాసికల్ డాన్స్ ప్రోగ్రాం, రాజమహేంద్రవరం కళాకారులచే ప్రత్యేక అడ్వాన్చర్ ప్రోగ్రాంలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

22వ ఫల పుష్ప ప్రదర్శనలు



ఆకట్టుకుంటున్న పుష్ప, మొక్కల ప్రదర్శన

ఫలపుష్ప ప్రదర్శనతో యానాంలో పండుగ వాతావరణం నెలకొంది. వేలాది మంది పూల ప్రేమికులు ఈ ప్రదర్శనకు విచ్చేస్తున్నారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫలపుష్ప ప్రదర్శన సోమవారంతో ముగియనుంది. ఫలపుష్ప ప్రదర్శనకు పూణె, బెంగుళూరు, కడియం మొక్కలను తీసుకువచ్చారు. పూలతో వివిధ రకాల ఆకృతులను తయారు చేశారు. వివిధ రకాల ఆకృతులతో బొకేలు, డ్రై ఫ్లవర్ బొకేలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రాంగణంలో వివిధ రకాల కాయగూరలు, పూలమొక్కలు, చెట్లను ఉంచారు. సుమారు 100 రకాల ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. వీటిలో హెచ్లో స్పెషల్ రోజ్, క్రైసాసమయ, చామంతి, పాయిబేటియా, తాయి లాండ్ వెరైటీ, ఫైర్బల్, జీరాబారా, స్పోరియా విత్ పాయిన్సటియా, కులంచో, జెరినియా, ఇంపోసెన్స్, మ్యారీగోల్డ్ (వివిధ రకాల బంతి), బోగోనియా, వ్యాసోనియా, డెన్రా డ్రాబియా, జిమియా, హెలోషియా, పాడ్జెట్స్, డాలియా తదితర జాతులు దేశ, విదేశీ పుష్పాలు పూల ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

యానాం క్రీడాకారుల ప్రతిభ



విజేతలకు ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - యానాం

కారైకల్‌లో నిర్వహించిన స్టేట్ స్కూల్ గేమ్స్ ఛాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్ పోటీలలో యానాం క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారని ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. అండర్-19 బాలుర విభాగంలో బి.సూర్య కిరణ్, మణికంఠ, చింతా సాత్విక్, ముఖేష్ కుమార్‌లు విజేతలుగా నిలిచారన్నారు. విజేతలను విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నక్కల సుబ్బన్న, ఐవికె.మోహన్, జల్లి చంద్రశేఖర్, వడ్డి వరప్రసాద్, కొప్పనాతి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు పెట్టడం ఆపాలి

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఇంద్రపాలెం లాకుల వద్ద గల పిఠాపురం మహారాణి రిక్రియేషన్ లేడీస్ క్లబ్‌లో చెత్తకు నిప్పు పెట్టడం ఆపాలనికాకినాడ రూరల్ సిపిఎం మండల కమిటి డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. క్లబ్ గ్రౌండ్‌ను వివిధ ఫంక్షన్లకు అద్దెకు ఇస్తూ ఫంక్షన్ తర్వాత రోజు చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను పురపాలక సంస్థ ద్వారా బయటకు తరలించకుండా నిప్పు పెడుతున్నారని అన్నారు. దీనివల్ల చుట్టు ప్రక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇదే అంశాన్ని సిపిఎం నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ, ఉదయ భాస్కర్ క్లబ్ బాధ్యుల దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. అయినా నిర్వాహకుల్లో ఏమాత్రం మార్పు లేదని, కావున ఉన్నతాధికారులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నివారణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



చెత్తను తగులపెట్టడంతో వ్యాపిస్తున్న పొగ కాలుష్యం

పడాల జీవితం-సాహిత్యం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

అభ్యుదయ రచయి తల సంఘం (అరసం), ఎస్‌కెవిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పడాల రామారావు శతజయంతోత్సవాల సందర్భంగా పడాల రామారావు జీవితం, సాహిత్యం పుస్తకాన్ని అవిష్కరించారు. 30 మంది రాష్ట్రస్థాయిలోని ప్రముఖ సాహితీవేత్తలకు పడాల రామారావు స్మారక పురస్కారాలు అందజేశారు. కళాశాలలోని వివేకవర్ధిని సెమినార్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి రాజమహేంద్రి విద్యా సంస్థల చైర్మన్ టికె.విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. డిగ్రీ కళాశాల తెలుగు శాఖాధిపతి పివిబి.సంజీవరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌వి.సూర్యనా రాయణరాజు, పుస్తక రచయిత డాక్టర్ పెనుమాకుల భాస్కరరావు, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, ఎస్‌కెవిటి.కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రమణమూర్తి, పురస్కార గ్రహీత, రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్య, పడాల రామారావు తనయుడు పడాల సోమశేఖరరావు, రమాదేవి దంపతులు, మాదేటి రవిప్రకాష్, చీకట్ల శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.